క్లుప్తంగా

ఏసీపీని కలిసిన నాయకులు



పరకాల: పరకాల ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఏదుల్లా కిషోర్‌కుమార్‌ను హుజురాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జేరిపోతుల రమేష్, పాక శ్రీనివాస్, బోలో రాజు, గోల్కొండ భిక్షపతి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



కమలాపూర్ : కమలాపూర్ నూతన ఎస్సైగా సీమా ఫర్హీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా ఇక్కడ విధులు నిర్వర్తించి బదిలీ పై వెళ్తున్న వెలిశెట్టి చరణ్‌కుమార్‌కు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ సిబ్బంది వీడ్కోలు పలికారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్ : దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ సోమవారం వెల్లడించారు. అధ్యక్షుడిగా మాట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఇసంపెల్లి ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా నద్దునూరి సురేష్, సహాయ కార్యదర్శిగా జేరిపోతుల శ్రీకాంత్, కోశాధికారిగా అంకిళ్ల రామస్వామి, కార్యవర్గ సభ్యులుగా కుమ్మరి శ్రీకాంత్, గిన్నారపు సుశీల, పుల్ల రమ, అక్కనపల్లి సారమ్మ, పుల్ల రాజు, బస్కుల అరుణ, ఇసంపల్లి అంజయ్య, గిన్నారపు రమేష్, మోతె కవిత, పునేటి రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బోరును సీజ్ చేయాలి

కమలాపూర్ : అనుమతి తీసుకోకుండా తన వ్యవసాయ భూమికి 50 మీటర్ల దూరం లేకుండా దమ్మక్కపేట వాసి మంజుల సమ్మయ్య బోరు వేసాడని, వెంటనే అతనిపై చర్య తీసుకొని బోరును సీజ్ చేయాలని మండలం మర్రిపల్లిగూడెంకు చెందిన తిరపతిగౌడ్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం వంగర పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వర్తిస్తున్న తనకు ఉన్న వ్యవసాయ భూమి పక్కనే తన అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మంజుల సమ్మయ్య దొంగతనంగా బోరు వేసాడని, ఈ విషయాన్ని తహసీల్దార్ , ఆర్‌ఐకి ఫిర్యాదు చేయడంతో ఇద్దరు పంచుల సమక్షంలో కొలతలు చేసినట్లు తెలిపారు. వెంటనే ఆర్‌ఐ సదరు వ్యక్తికి ఫోన్ చేసి బోరు సీజ్ చేస్తున్నామని తెలిపినా ఏమి చేసుకుంటారో చేసుకోండని అధికారులకు బదలిచ్చాడని తెలిపారు. పంచానామా కాపీని తహసీల్దార్ చూపించి ఆర్‌ఐ సీజ్ చేయడానికి అనుమతి కోరగా తహసీల్దార్ నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని తెలిపారు.

ఎస్సైకి సన్మానం

శాయంపేట : మండల నూతనంగా బాధ్యతలు చేపట్టిన దేవేందర్‌ను ప్రజాప్రతినిధులు సోమవారం సన్మానించారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు అరికిల్ల ప్రసాద్, అబ్బు ప్రకాశ్ రెడ్డి, గోలీ మాధురిమహేందర్ రెడ్డి, ఆకుతోట రాజేష్, గజ్జెల లావణ్యరాజు, ముక్కెర అనూషప్రేమ్‌సాగర్, జర్పుల మాజీబాయివెంకట్రాముల్‌నాయక్, ఏదుల ప్రమీలరమేష్, పొడమేల మమతసంపత్, ఎంపీటీసీలు వావిలాల వేణుగోపాలప్రసాద్, మాచర్ల మంగమ్మ రవి, మేకల శ్రీనివాస్‌లు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి అశోక్, గుర్రం సుధాకర్, కొమ్ముల భాస్కర్, మేకల వెంకన్న, గుగులోతు రవీందర్, రమేష్, రామకృష్ణ, కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రవన్‌కు సత్కారం

ఐనవోలు: మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన న్యాయ విద్యార్థి బర్ల శ్రవణ్‌ను ఐనవోలు ఆలయ చైర్మన్ మజ్జిగ జైపాల్ సోమవారం శాలువాతో సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ 2023 అవార్డు వచ్చిందని శ్రవణ్ తెలిపారు.

ఘనంగా జేఎస్‌ఆర్ జన్మదినం



ఎల్కతుర్తి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి జన్మదినాన్ని ఆ పార్టీ నాయకులు సోమవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.



నడికూడ : ఉరితాడుతో నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



ఆత్మకూరు : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

కొనసాగుతున్న పంచాయతీ సిబ్బంది సమ్మె

నడికూడ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జీపీ కార్మికులు ఉరితాడుతో నిరసన తెలుపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ అధ్యక్షుడు పర్శ భాస్కర్, రమేష్, శంకర్, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో 19వ రోజుకు చేరింది. ఆ సంఘం జేఏసీ మండల శాఖ అధ్యక్షుడు అయిలయ్య మాట్లాడారు. జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం హేయమైన చర్యన్నారు. మండల శాఖ ఉపాధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, సలహాదారు స్వామి, జిల్లా నాయకులు భాస్కర్, అరుణ ఎల్లస్వామి పాల్గొన్నారు.



కమలాపూర్ : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు



ధర్మసాగర్‌లో..

ఆత్మకూరు : తమ డిమాండ్ల పరిష్కారానికి మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగుతోంది. 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం హేయమైన చర్యన్నారు. వెంటనే డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. వడ్డెపల్లి రాంబాబు, ఉప్పుల రవి, సదానందం, సారంగం, రాజు పాల్గొన్నారు.

ధర్మసాగర్: గ్రామాల పరిశుభ్రతలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాత్ర కీలకమని, అలాంటి వారి న్యాయమైన డిమాండ్లు, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మెకు ఆ పార్టీ నాయకులు సోమవారం సంఘీభావం తెలిపారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సంట, వెంకటేష్, విజయరావు, అంజిరెడ్డి, జీపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు విజయ్, లింగం , పాడిషెట్టి రంజిత్, రణధీర్, పాల్గొన్నారు.

పేస్కేల్ జీఓ జారీపై వీఆర్‌ఏల హర్షం

పరకాల / కమలాపూర్ / శాయంపేట / ధర్మసాగర్: పే స్కేల్ అమలు చేయడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఆయా మండలాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణాల్లో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రుల సబ్ కమిటీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని కొనియాడారు. వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు వివధ గ్రామాల వీఆర్‌ఏలు తదితరులు ఉన్నారు.



కమలాపూర్‌లో..



శాయంపేటలో..



ధర్మసాగర్ : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల: ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను సోషల్ మీడీయా ద్వారా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చాడు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ సోషల్ మీడీయా బాధ్యులు (బీఆర్‌ఎస్ యూత్ నాయకులు), ముఖ్య నాయకులతో సోమవారం పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు చేస్తున్న సేవలను సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బీఆర్‌ఎస్ సోషల్ మీడియా బాధ్యులపై ఉందన్నారు. కొందరు అధికారం కోసం తహతహలాడుతూ కేసీఆర్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. అలాంటి మోసపూరిత వ్యక్తులను దీటైన జవాబు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టేలా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా బాధ్యులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. నియోజవకర్గంతో పాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తూ ప్రజలకు, యువతకు తెలియపర్చాలని అన్నారు. అనంతరం సతీష్‌రెడ్డి సోషల్ మీడియా పరిణామాలపై వివరించారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే లక్ష్యం

ఐనవోలు: రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కును గర్మిళ్లపెల్లి గ్రామానికి చెందిన దర్శనాల కవితకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమం విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. అనిన వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల మదిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రత్యేక చోటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గబ్బెట రాజయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

ముదురుగులోనే మూలుగుతున్న వీధులు

దామెర: వర్షం తగ్గుముఖంపట్టి మూడు రోజులైనా మండల కేంద్రంలోని యాదవుల వీధులు మురుగులోనే మూలుగుతున్నాయి. గ్రామంలోని యాదవుల వీధిలో కొన్ని సంవత్సరాల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. కొంతమంది స్వార్థంతో సీసీ రోడ్డు ఉన్నప్పటికీ దానిపై మూడడుగుల మేర మొరం పోశారు. దీంతో వర్షం కురిసినప్పుడల్లా మూడు వీధులను కలిపే జంక్షన్‌లో పెద్ద ఎత్తున వరదనీరు చేరడంతో బురదమయంగా మారింది. దీంతో ప్రజలు అడుగు తీసి అడుగు వేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా వరద నీటికి తోడు కొంత మంది ఇళ్లలో నుంచి వస్తున్న మురుగు నీరుతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. స్థానిక సర్పంచ్, అధికారులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా నిలిచిన మురుగు నీరు

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట : మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. హాజరు రిజిస్టర్ ఎందుకు మెయింటెన్ చేయడం లేదని వైద సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో 24గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటున్నారని అని డాక్టర్ సాయికృష్ణ అడిగితెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు. సర్పంచ్ కందగట్ల రవి స్థానిక గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఈజీఎస్ నిధుల నుంచి రూ. 20లక్షలు మంజూరైయ్యాయని, సీడీఎఫ్ నుంచి మరో రూ. 30లక్షలు కేటాయిస్తే ప్రగతి సింగారం జీపీ మాదిరిగా మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యేను కోరడంతో స్పందించిన ఆయన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతకు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్, పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ సుమన్ తదితరులు ఉన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

పరకాల: వరకట్న వేధింపులు, లైంగిక వేధింపుల బారిన పడుతున్న బాధిత మహిళలకు సఖి కేంద్రం అండగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యలక్ష్మీ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సఖి సేవలపై సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడారు. వేధింపులతో మానసికంగా కృంగిపోయే మహిళలకు సఖి కేంద్రం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. అందుకోసం 0870–2452112 లేదా టోల్ ఫ్రీ 181కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కేస్ వర్కర్ వి.వినీల, హరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని మహిళలకు మహిళలకు సఖి వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ సఖి కేంద్రంలో మహిళలకు వైద్య, న్యాయ, పోలీసు కౌన్సిలింగ్ సహాయంతో పాటు తాత్కలిక వసతి అందించనున్నట్లు తెలిపారు. చట్టాలను ప్రతీ మహిళ వినియోగించుకోవాలని, బాధిత మహిళలు ఎవరైనా సఖి సెంటర్ వద్ద తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో 181 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ వినీల, వివో, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిత

ఆజంజాహి మిల్స్ కార్మికులను ఆదుకోండి

నయీంనగర్: ఆజంజాహి మిల్లు కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన 200గజాల ఇంటి స్థలాలను ఇవ్వాలని ఆజంజాహి మిల్స్ వీఆర్‌ఎస్ కార్మికుల సంఘం అధ్యక్షుడు కుడికాల కుమారస్వామి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత హైకోర్టు ఉత్తర్వుల మేరకు మొదట 134 మందికి, ఈఏడాది మే, జూన్‌లలో 318మందికి 200 గజాల చొప్పున స్థలం ఇచ్చారని తెలిపారు. మిగతా వారందరూ చనిపోయారని 318 మంది స్థలాలు తీసుకున్నారని వాపోయారు. అయితే, ఇంకా 150 మంది మిల్లు వీఆర్‌ఎస్ కార్మికులు బతికే ఉన్నారని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

డ్రెయినేజీ శుభ్రం చేయించిన సర్పంచ్

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన రహదారికిరువైపుల గల డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని సర్పంచ్ కందగట్ల రవి సోమవారం మల్టీపర్పస్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. మురికి కాలువలో చెత్తా, చెదారం పేరుకుపోవడంతో ప్రజలు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ముందస్తు చర్యగా కాల్వను శుభ్రం చేయించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తదితరులు ఉన్నారు.

మద్యం షాపులు నిబంధనలు పాటించాలి

వరంగల్ క్రైం: మద్యం షాపుల యజమానులు నిబంధనలు పాటిస్తూ దుకాణాలు నిర్వహించాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ సెంట్రల్ జోన్ పరిధిలోని మద్యం దుకాణ వ్యాపారస్తులతో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల పరిసరాల్లో ఎవరూ మద్యం తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులకు సూచించారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వారి వాహనాలను సరైన క్రమంలో పార్కింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏసీపీలు కిషన్, కిరణ్‌కుమార్, డేవిడ్ రాజు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ బారి

చిన్నారికి అభినందన

హన్మకొండ: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని వి.సార్నిక చోటు సాధించింది. 3వ తరగతి చదువుతున్న వి.సార్నిక 118 రసాయన మూలకాలను (నేమ్ ఆఫ్ ది ఎలిమెంట్స్) 2 నిమిషాల 30 సెకన్లలో చెప్పి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో చిన్నారి సార్నికకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును కలెక్టర్ సిక్తా పట్నాయక్ అందించి అభినందించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు: మండలంలోని అర్హులైన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అడప కవిత సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2023 జూన్ 18 వరకు పట్టాపాస్ బుక్కులు పొంది రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్టు 5వ తేది లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. 1964 ఆగస్టు 14, 2005 ఆగస్టు 14 మధ్య వయస్సు గల రైతులు మాత్రమే రైతుబీమాకు అర్హులని అన్నారు. అదే విధంగా గతంలో బీమా నమోదు చేసుకున్న వారు పేరు తప్పుగా ఉన్నా, నామినీ వివరాల్లో మార్పులు చేర్పులు ఉంటే ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. పట్టాపాసుబుక్, ఆధార్, నామిని ఆధార్ జిరాక్సులను దరఖాస్తు పత్రానికి జతచేసి అందించాలని కోరారు. గర్మిళ్లపెల్లి, వెంకటాపూర్ క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈఓ అనూష, కొండపర్తి, వనమాల కనపర్తి క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈఓ అరుణ్, పంథిని, పున్నేలు క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈఓ సువర్ణ, నందనం, కక్కిరాలపల్లి క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈఓ ఐశ్వర్య, ఐనవోలు, సింగారం క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈఓ హీన కౌసర్‌లకు దరఖాస్తులు అందించాలని సూచించారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. - సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : కేక్ కట్ చేస్తున్న గండ్ర దంపతులు



పరకాల : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



కమలాపూర్ : కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి



ఎల్కతుర్తిలో..



ఐనవోలులో..

అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలి



శాయంపేట : మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సోమవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఏబీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు నాగుల పవన్‌కళ్యాణ్, మంద సురేష్‌లు సోమవారం వినతిపత్రం అందించారు. శాయంపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో అనేక అక్రమాలు జరిగాయని వినతిలో పేర్కొన్నారు. ఐకేపీ నిర్వాహకులు, మిల్లర్లు కలిసి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. ఐకేపీ నిర్వాహకులపై, మిల్లర్లపై విచారణ చేపట్టాలని లేని పక్షంలో రైతులతో కలిసి నిరహార దీక్ష చేపడుతామని వినతిలో హెచ్చరించారు.